# తలుపు మయ్యాలి

శ్రీమతి పి. రుక్మిణీబాయిగారు

అది శ్రావణమాసం. విశ్వవైణికుడు నభోవిపంచిక నైదువేళ్లతో జోరుగా మీటుతున్నాడు. భూనభోంతరాలు ఏకం అయ్యేటట్లు సంతతధారగా వర్షాలు కురుస్తున్నాయి.

రోజూలాగ కాక ఆనాడు మరింత హోరుగాలితో వర్షం కురుస్తూఉంది. జిల్లుమంటూ చలి వొణుకిస్తూంది. వీధివసారాతలుపు బార్లా తీసుంది. వసారాకు ఎదురుగా కూర్చున్న ముసలాతడా గాలిని ఓర్చుకోలేకపోయాడు. వీధరుగుమీద నుంచుని చూరు నీళ్లను దోసిళ్లతోబట్టి ఎగజిమ్ముతూ ఆడుకుంటూన్న తన మనవణ్ణి కేకేసి, 'ఓరే! తలుపుమయ్యరా యీముసురుగాలికి ప్రక్కలీడ్చుకు పోతున్నాయి' అన్నాడు. సుబ్రాడు తాతమాట వినిపించుకోనక తన ఆటసందడిలోనే ఉన్నాడు. తాత మళ్లీ మనవణ్ణిపిల్చి 'ఒరే! తలుపు మయ్యరా' అన్నాడు. ఇంకా సుబ్రాడు ఆట ధ్యానంలోనే ఉన్నాడు. మళ్ల ముసలాయన గట్టిగా అదరించి పిల్చాడు మనవణ్ణి. ఈసారి సుబ్రాడి దృష్టి తాతకేసి మరలింది. 'ఒరే! తలుపుమయ్యమని నీకెన్నిసార్లు చెప్పరా! నువ్వెక్కడేనో పడిపోయినట్లు నిల్చిపోయావు. నాకు వళ్లు కుళ్లు తిరిగి పోతూందారొ! యికనైనా తలుపు మూస్తువా?' అన్నాడు తాత.

మనమడు—తాతయ్యా! నేనేదో ఆటపరాకులో ఉండగా నీవు పిలవడంచేత వినిపించుకోలేదు. అది నాతప్పే. క్షమించు. ఇదిగో మూసివస్తిని. ఇకముందు సరిగానడచుకొంటాను.

తాతయ్య—సుబ్రాడా! నేనిప్పుడేదో చెబుతున్నానని నీకు కోపంవద్దు. ఇప్పుడు నేను నీకు చెప్పబోయే మాటలే కొన్ని సద్గుణాల్ని బోధిస్తాయి. నీజీవితకాలంలో యితరుల సౌఖ్యాన్నే గొప్పగా చూస్తాండే అభ్యాసం చేసుకోవాలి. ఇంతేకాదు. ఈచిన్న విషయంలో నీకు చెప్పబోయే మాటలే యింకాయితర గొప్ప విషయాల్లోకూడా నీకక్కర కొస్తాయి. ఈ యింటివాకిటి తలుపేకాకుండా నువ్వు చాలాజాగ్రత్తగా తెరవక మూసియుంచవలసిన తలుపులింకాకొన్ని ఉన్నాయి.

మనమడు—ఇంకా ఏంతలుపులున్నాయి? తాతయ్యా!

తాతయ్య—సుబ్రాడా! ఐదునిమిషా లిల్లాకూర్చుంటే విషయాలన్నీ సావధానంగా బోధిస్తాను. తిట్టూ బూతూ మొదలైన చెడ్డమాటలూ చెడ్డపిల్లాళ్ల దురాలోచనలూ వచ్చి నీచెవిలోదూరకుండా వాటితలుపుల్ని జాగ్రత్తగా మూసి ఉంచాలి. లేకపోతే నువ్వు సుఖపడవు. ఎప్పుడైనా పొరపాటున ఆద్వారాల్ని తెరిచి ఉంచావా అవి అందుచొరబడి నిన్ను అంటి విడిచిపోవు.

అల్లాగే నీకళ్లద్వారాల్నికూడా నువ్వు జాగ్రత్తగా కాపాడాలి. చెడ్డ కథలన్నీ, చెడువిషయాల్ని ఉపయోగంమాలిన పుస్తకాలిని నువ్వు చదవకూడదు. వాటిని నువ్వు చదవడంమొదలు పెడితే అసలు కావలసిన చదువులయందపేక్ష తగ్గి పాడయిపోతావు. ఇంకా చెడుపదార్థాల్ని చూసి నువ్వు కళ్లుమూసుకోవాలి. లేకపోతే వివేకం చెడి పాడైపోతావు. ఇంకా బజార్లో పంచిపెట్టే వింతవస్తువులమీదకూడ తరుచు నీదృష్టులు పోనీక వాటితలుపులు జాగ్రత్తగా మూసిఉంచు.

ముఖ్యంగా నీనోటిద్వారాన్ని గురించి అన్నిటికన్నా ఎక్కువశ్రద్ధ తీసుకోవాలి. ఏమంటే యీద్వారానికి తనంతట తానే తెరుచుకొనే స్వభావం ఉంది. కనుక నువ్వు దీన్నిగురించి ప్రత్యేక జాగ్రత తీసుకోకపోతే

" తనువున విఱిగిన యలుగుల
ననువున బుచ్చంగవచ్చు నతినిష్ఠురతన్
మనమున నాటిన మాటలు
వినుమెన్ని యుపాయములను వెడలునె? యధిపా! "

అన్నట్లు నీమాటలు చాలమందికి మనస్తాపం కలిగిస్తాయి. చివరికి నీకు చెడుగుపుట్టిస్తాయి. కనుక నీకు కావలసిన జ్ఞానం, చక్కగా మాట్లాడేశక్తి, పూర్తిగా తెలుసుకునేవరకూ దీన్ని తెరవకమూసిపెడితే జ్ఞానం పొందుతావు.

వీటన్నింటికన్నా మరీ ఎక్కువ జాగ్రత్తతో నీవు నిత్యం శ్రద్ధతో కాపాడవలసినద్వారం మరోటుంది. అదే నీమనోద్వారం. అది సంతతం నీహృదయాన్ని తట్టి చలింపజేస్తుంది. దాన్ని జాగ్రత్తగా కాపాడ్డమే కష్టమైనపని. దురాశ మొదలైన దుర్గుణాలు నీ మనస్సులో చొరకుండా ఆ[illegible]ంపే కాపాడుతుంది. ఆ ద్వారానికి పరిరక్షకుడే నీ మనస్సాక్షి. అతడు అప్రమత్తతో యీలాంటి చెడ్డతలంపులు నీలోచొరకుండా మెలకువతో కావలికాస్తాడు. అలాంటప్పుడు వాని బలాన్నితృణీకరించే దుర్గుణం ఏదైనా నీమనస్సులో చొరబడేటప్పుడు నీమనస్సాక్షి నీకు తెలియబరుస్తాడు. అతడు తెలియ పరచినాగానీ నువ్వు లక్ష్యంచెయ్యకపోతే వాడు నీమీద కోపగించి నీద్వారపాలనావిధానాన్ని మానేసి నిద్రపోతాడు. అప్పుడిక అడ్డులేకపోవడంచేత అనేకవిధములైన దుర్గుణాలు నీలో ప్రవేశించి నిన్ను నాశంచేస్తాయి. కనుక ఎన్నడూ అలా తటస్థించకుండా నీద్వారాల్ని నువ్వు శ్రద్ధగా కాపాడుకుంటూ ఉంటే జగదేకవంద్యుడవవుతావు.

మనమడు—అట్లాగే తాతయ్యా! నీవుచెప్పినట్లు తప్పకుండా నడుచుకుంటాను. ఇల్లాంటి విషయాలెన్నడూ మాగురువు, తండ్రీ కూడా చెప్పలేదు. ఇవన్నీ నాజీవితంలో ఆదర్శకంగా పెట్టుకుంటాను.